

# అనుకోని కథ

– రాధిక మంగిపూడి



(గత సంచిక తరువాయి)

జరిగిన కథ

ప్రస్తుత కథలో మధుర తన అభిమాన హీరో అభిరామ్ ను కళ్ళారా చూడగలిగే అవకాశం పోయిందని బాధ పడుతుంది. ఒకరోజు రాత్రి ఒక్కర్తే జనసంచారం లేని సందులో నడుస్తూ ఉండగా ఒక కారుకు చిన్న యాక్సిడెంట్ అవుతుంది. ఆ కారులోని వ్యాపారవేత్త సత్యనారాయణకు మధుర అనుకోకుండా సహాయం చేసి, చినుకులు ప్రారంభం అవడంతో అతని కారులోకి ఎక్కుతుంది.

గతకాలపు కథలో మాళవ రాజ్యంలో త్రిశూలగిరి కొండపై సాయం సంధ్య వేళ పురుష రూపంలో ఉన్న ఒక వీర వనిత తన గురువును కలుసుకుంటుంది. సువర్ణపురి గ్రామంలో గుణశేఖరుడు తన బాల్య స్నేహితురాలు అయిన మాలతిపై అవ్యాజమైన ప్రేమను పెంచుకుంటాడు. అర్ధరాత్రి కాళికాలయంలో దుండగుల నాయకుడైన సంజీవుడు అతని అనుచరులతో కలిసి కుతంత్రాలను చర్చిస్తాడు.

## ఆహ్వానం

సత్యనారాయణ కారులో ప్రయాణిస్తూ దారిలో మధుర తల్లిదండ్రుల వివరాలు, ఆమె చదువు వివరాలు అడిగి తెలుసుకున్నాడు. గోదావరిలాగే గలగలా సాగే ఆమె మాటలు వింటుంటే సత్యనారాయణకు చాలా ఆనందంగా అనిపించింది. వ్యాపారరీత్యా ఎప్పుడూ బిజీగా ఉండే తనకు, సొంత కొడుకుతో కూడా సరిగ్గా మాట్లాడడానికి సమయం ఉండదు. అమాయకంగా స్వచ్ఛంగా మాట్లాడే మధుర మాటలు అతనిని ఎంతో ఆకర్షించాయి. మాటతీరులోగానీ ఆహార్యంలోగానీ ఈ రోజుల్లో ఆడపిల్లలకు ఎంతో భిన్నంగా కనిపించింది మధుర. ఆమెను ఇంటి వరకు దింపి వెళ్ళిపోయాడు. కలవాలనుకునే వారిని కలవలేకపోవడం, ఎవరో తెలియనివారిని అనుకోకుండా కలవడం... అసలు ఈ సంఘటనలన్నీ ముందే నిర్ణయింపబడి ఉంటాయా? దేవుడు స్క్రీన్ ప్లే రాస్తాడా మన జీవితాలకు?.. ఏవేవో ఆలోచనలు మధురకు ఆ రాత్రంతా.

మర్నాడు 12 గంటల సమయంలో ఒక కొత్త నెంబర్ నుండి మధుర ఫోన్ పైకి ఒక ఫోన్ వచ్చింది. ఎవరో అనుకుంటూనే ఎత్తి మాట్లాడింది.

అవతలి నుంచి "నేనమ్మా! సత్యనారాయణని. నిన్న రాత్రి కారు... యాక్సిడెంటు... నాకు సహాయం చేశావు కదా!" అన్నాడు అవతలివ్యక్తి.

"ఓహ్! మీరా అంకుల్! ఎలా ఉంది ఇప్పుడు మీకు? నిన్న ఇంటికి త్వరగా చేరిపోయారా?" వెంటనే పలకరించింది మధుర.

"నాకు బానే ఉందమ్మా! రాత్రి ఇంటికి వచ్చేసరికి 9:15 అయింది. నన్ను దింపాక డ్రైవర్ మళ్ళీ వెళ్ళి అక్కడ వదిలేసిన కారు కూడా గ్యారేజీలో ఇచ్చేసి ఇంటికి వెళ్ళాడు. ఇవాళ ఉదయం మా ఫ్యామిలీ డాక్టర్ని కలిసాను. బీపీలో తేడా వల్లనే అలా అయిందని చెప్పి మాత్ర డోసు మార్చాడు. ఇవాళ సాయంత్రం నువ్వు ఖాళీగా ఉంటే మా ఇంటికి టీ తాగడానికి రావాలి. నిన్న నిన్ను చూసిన దగ్గరనుండి ఎంతో

ఆప్యాయంగా అనిపించింది. నిన్న నీ ఫోన్లో నుండి మా అబ్బాయి చిన్నాకు ఫోను చేశాను కదా! అక్కడ నుండి నీ నెంబర్ తీసుకుని ఫోన్ చేస్తున్నాను. నిన్న నీకు సరిగ్గా థాంక్స్ కూడా చెప్పలేకపోయాను. నువ్వు తప్పకుండా రావాలి. కాదనకు తల్లీ!" అన్నాడు సత్యనారాయణ ఆపకుండా ఆప్యాయంగామాట్లాడుతూ.

"అయ్యో! ఫరవాలేదు అంకుల్! ఏదో అనుకోకుండా కలిశాము. మీరు ఇబ్బంది పడకండి. అయినా నాకు మీ ఇల్లు ఎక్కడో కూడా తెలియదుగా!" అంది మధుర తడబడుతూ ఏం చెప్పాలో తెలియక.

"మా ఇల్లు మీ కాలేజీకి దగ్గరే. మీ కాలేజీ దాటి మెయిన్ బజార్ రోడ్డు పక్కకు వస్తే కుడి పక్క రోడ్ నెంబర్ 4 లో మొదటి ఇల్లే. అయినా అక్కడవరకు వచ్చి 'సత్య ఇండస్ట్రీస్' వాళ్ల ఇల్లు అని అడిగితే ఎవరైనా చెప్తారు. ఎలాగూ నేను కారు పంపిస్తాను కదమ్మా! నీకెందుకు బెంగ! నిన్న మీ ఇల్లు కూడా మా డ్రైవర్ చూశాడుగా! 4 గంటలకల్లా తయారుగా ఉండు. కారు వస్తుంది. తప్పకుండా కలుద్దాం." అని చెప్పి ఫోన్ పెట్టేశాడు సత్యనారాయణ.

అంతే! మధుర నిర్ఘాంతపోయి ఫోను వంక చూస్తూ ఉండిపోయింది కాసేపు. ఆమె నోట ఉలుకు పలుకు లేదు. సత్య ఇండస్ట్రీస్ అధినేత అంటే వేరెవరో కాదు. అభిరామ్ కన్న తండ్రి. ఈ విషయం ఇదివరకు అభిరామ్ ఇంటర్వ్యూలో తాను విని ఉంది. కానీ రాత్రి సత్యనారాయణ అతని పేరు చెప్పినప్పుడు అతను ఎవరో ఆమె గుర్తించలేదు. అతని ఫోటో కూడా ఎప్పుడూ ఆమె చూసి ఎరుగదు. ముందురోజు రాత్రి సత్యనారాయణ తన ఫోను నుండి మాట్లాడినది అభిరామ్ తోనే అన్నమాట.

తన జీవితంలో ఏం జరుగుతుందో ఆమెకు అర్థం కావటం లేదు. ఉన్నపాళంగా చతికిలబడిపోయింది. అరిచేతులు చల్లగా అయిపోయాయి. అభిరామ్ ను కాస్త దూరంనుండి చూసే అవకాశమే చేజారిందని బాధపడుతున్న తనకు నేరుగా వాళ్ళింటికి రమ్మని అతని తండ్రి నుండే ఆహ్వానం వచ్చిందంటే అది కలో నిజమో అర్థం కాలేదు ఆమెకు. ఇప్పుడు తను వెళ్లాలా వద్దా? వెళ్లాక అక్కడ అభిరామ్ ను నేరుగా పరిచయం చేసుకొని మాట్లాడే అవకాశం వస్తుందా రాదా? తను వెళ్లే సమయానికి అతడు ఇంట్లో ఉంటాడా ఉండడా? అవసరమా ఇప్పుడు తనకీ కొత్త స్నేహ బంధాలు? ఆలోచనలతో తల గిర్రున తిరుగుతోంది మధురకు.

కాసేపు కర్మ సిద్ధాంతాలు, భ్రాంతులు, మమకారాలు, జాగ్రత్తలు... అన్నీ పక్కన పెట్టి ఆలోచిస్తే, ఇది అందరికీ దక్కే అవకాశం కాదు అనిపించింది ఆమెకు. అంత పెద్దాయన వాళ్ళింటికి మర్యాదగా పిలిస్తే వెళ్ళకపోవడం అసలు సంస్కారం అనిపించుకోదు. కనుక ఎలా ఆలోచించినా వెళ్ళడమే కరెక్ట్ అని నిర్ణయించుకుంది. అయితే ఈ విషయం తన స్నేహితురాళ్లకు ఎవరికీ చెప్పదలుచుకోలేదు. ఎవరు ఏ విధంగా అర్థం చేసుకుంటారో తెలియదు కనుక చెప్పకపోవడమే మంచిదనిపించింది ఆమెకు. ముందురోజు రాత్రి సత్యనారాయణను కలిసిన విషయం కూడా వారెవరికి చెప్పలేదు. వాళ్ల దృష్టిలో ఆమె ముందురోజు కాలేజీ నుండి నేరుగా ఇంటికి వచ్చేసింది. హైదరాబాద్లోనే తన దూరపు చుట్టాలు కూడా ఉంటారని గతంలో వాళ్ళకి చెప్పింది మధుర. కనుక వారి ఇంటి నుండి ఫోన్ వచ్చిందని, వారి ఇంటికి వెళ్లి ఒకసారి కలిసి వస్తానని మిగతా వాళ్ళకి అబద్ధం చెప్పింది. సమయానికి ముందే తయారైపోయింది. తనకు ఇష్టమైన తెల్లని చూడీదార్ వేసుకుంది. కారు వచ్చేలోపే అపార్ట్మెంట్ గేటు పక్కనే ఉన్న షాపులో ఆపిల్స్ కొని, అక్కడే నిలబడి కారు రాగానే ఎవరూ చూడకుండా ఎక్కేసింది. సత్యనారాయణ ఇంటికి వెళ్లే వరకు ఆమె గుండె 101 కొట్టుకుంటూనే ఉంది. ఏదో తెలియని ఆత్రుత, భయం, ఉత్సుకత, ఆనందం అన్ని స్పందనలూ కలిసిపోయాయి.

చక్కటి పెద్ద బంగ్లా గేటులోనికి వెళ్లింది కారు. గేటు దాటగానే పెద్ద పచ్చని లాన్. ఆకర్షణీయమైన పువ్వుల మొక్కలు పొందికగా మధ్యలో అమర్చినట్టు ఎంతో అందంగా మనసును హత్తుకునేలా ఉంది ఆ ఇల్లు. గేటు వద్ద ఒక సెక్యూరిటీ గార్డ్ ముందే సలాం కొట్టాడు. తోటమాలి మొక్కలకు నీళ్లు పోస్తూ కనిపించాడు. రంగురంగుల పువ్వులన్నీ నీటి చినుకుల్లో తడిసి బోసి నవ్వుల పసిపిల్లల్లా రెక్కలాడిస్తున్నాయి.

"రండమ్మా! సార్ మీకోసమే ఎదురు చూస్తున్నారు." అంటూ నడివయసులోనున్న ఒకావిడ తలుపు బయటే పలకరించింది మధురను.

అభిరామ్ తల్లి అతని చిన్నప్పుడే చనిపోయిందన్న విషయం మధురకు తెలుసు. ఆమె ఇంటిని కనిపెట్టుకుని ఉండే ఆయా లేక వంట మనిషి అయి ఉండవచ్చు అనుకుంది మధుర. ఆమె పలకరింపు ఎంతో ప్రేమగా నిర్మలంగా అనిపించింది. గుమ్మం బయట చెప్పులు విప్పి తనకు తెలియకుండానే కుడికాలు ముందు పెట్టి లోనికి అడుగు వేసింది మధుర. ముందు చిన్న ఆఫీసు గది, అది దాటగానే పెద్ద హాలు, అందులో చక్కటి సోఫాలు, ఫ్లవర్వాజులు, గోడలకు మంచి కళ ఉట్టిపడే చక్కటి పెద్ద వర్ణచిత్రాలు, వాటిపై పడే విధంగా చిన్న చిన్న ఎల్ఈడి లైట్లు... భలే అందంగా అనిపించింది ఆమెకు. కళ్ళు పెద్దవి చేసుకొని మరీ అంతా కలయజూస్తోంది. ఇంతలోనే లోపల నుండే సత్యనారాయణ ఎదురు వచ్చి ఆమెను స్వాగతించాడు. సోఫాలో కూర్చోబెట్టి పలకరించాడు.

"లక్ష్మీ! వెళ్లి నీళ్లు తీసుకురా! అలాగే టీ కూడా సిద్ధం చెయ్యి!" అన్నాడు. ఆమె తలాడించి లోనికి హడావిడిగా వెళ్లిపోయింది.

మధుర సత్యనారాయణకు నమస్కరించి తాను తెచ్చిన పళ్ళను టేబుల్ మీద పెట్టింది. అభిరామ్ ఇంట్లో ఉన్నాడో లేదో తెలియదు. అడగడానికి కూడా ఆమెకు భయం వేస్తోంది.

"నువ్వు రావడం చాలా సంతోషం మధురా! నిన్న భలే కలిశాము కదా! అనుకోకుండా సమయానికి నువ్వు చాలా సహాయం చేశావు తల్లీ! ఈరోజుల్లో పక్కనే మనిషి ప్రాణం పోతున్నా పట్టించుకునే నాథుడు లేడు. అలాంటిది నీలాంటి ఈ కాలపు అమ్మాయి అంత బాధ్యతగా ప్రవర్తించడం చూస్తే నాకు చాలా ముచ్చటేసింది." అంటూ చెప్పుకుపోతున్నాడు సత్యనారాయణ.

లక్ష్మీ నీళ్లు తీసుకువచ్చింది. మధుర గ్లాసు అందుకుని చుట్టూ కలియజూస్తోంది. ఆమె కళ్ళు ఆమెకు తెలియకుండానే అభిరామ్ ను వెతుకుతున్నాయి. ఒక వారగా గోడకు అభిరామ్ సత్యనారాయణ కలిసి ఉన్న ఫోటో ఒకటి కనిపించింది మధురకు.

ధైర్యం చేసి నెమ్మదిగా దాని వైపు చూపిస్తూ "హీరో అభిరామ్ మీ అబ్బాయా సార్?" అని అడిగింది.

సత్యనారాయణ వెంటనే "అవును. నా కొడుకే! చాలామంది ఈమధ్య 'మీరు అభిరామ్ నాన్నగారా?' అని అడుగుతున్నారు. నువ్వు ఇంకా పాత పద్ధతిలో 'తను మీ అబ్బాయా' అని అడిగావు. సంతోషం." అంటూ గట్టిగా నవ్వాడు.

కొంచెం మొహమాటపడుతూనే "సారీ సార్! నిన్న నాకు మీరు ఎవరో తెలియలేదు. ఇవాళ ఫోన్ లో మీరు సత్య ఇండస్ట్రీస్ పేరు చెప్పేవరకు నేను మిమ్మల్ని పోల్చుకోలేకపోయాను క్షమించండి." అంది.

"ఏమి ఫరవాలేదు తల్లీ! నిన్న పిలిచినట్లే నన్ను 'అంకుల్' అనే పిలువు. ఎందుకో నిన్ను చూడగానే మా ఇంట్లో పిల్లలాగా అనిపించావు. నువ్వు ఇకపై కూడా నీకు ఎప్పుడు ఏ సహాయం కావాలన్నా నిస్సంకోచంగా నేరుగా మా ఇంటికి వచ్చి నన్ను అడగవచ్చు. సరేనా!" అన్నాడు చిరునవ్వుతో సత్యనారాయణ.

మధురకు ఆ మాట వింటే చాలా ఆనందంగా అనిపించింది. నిజానికి తనకు ఏ సహాయం అక్కర్లేదు. కానీ ఆ మాట వినడమే చాలా ధైర్యాన్నిస్తుంది. ఊరు కాని ఊరులో ఒక్కతే ఉండి చదువుకుంటోంది. ఎవరంటారు అంతటి మాట! అందులోనూ సంఘంలో పరువు ప్రతిష్టలు ఉన్న అంతటి వ్యక్తి అనడం అంటే మాటలా అనిపించింది ఆమెకు.

ఆనందంగా "అలాగే అంకుల్ ! మీరు చెప్పినట్లే పిలుస్తాను. మిమ్మల్ని చూస్తే నాకు కూడా చాలా దగ్గరవారుగా అనిపించారు నిన్ననే. ఎప్పుడూ మా అమ్మానాన్నలను విడిచి ఇంతదూరం రాలేదు. ఈ ఊరిలో పెద్దగా తెలిసినవారెవరూ కూడా లేరు. ఈ మధ్య మా ఇల్లు, అమ్మానాన్నలు ఎక్కువగా గుర్తు వచ్చి ఏదో బెంగగా ఉంటోంది. ఇవాళ మీ మాటలు చాలా ధైర్యాన్ని ఇచ్చాయి. చాలా థాంక్స్ అంకుల్!" అంది మధుర.

ఆమె కళ్ళలో మెరుస్తున్న ఆనందాన్ని గమనించిన సత్యనారాయణ వెంటనే “ఈ మాత్రం మాటకి థాంక్స్ ఎందుకమ్మా! నాకు ఆడపిల్లలు లేరుగా! అసలే ఇది ఆడదిక్కు లేని కొంప. అందుకే దేవుడు నిన్ను పంపాడేమో! ఇది మీ ఇల్లే అనుకో తల్లీ!” అన్నాడు తృప్తిగా ఆమెవైపు చూస్తూ. మధుర చిన్నగా నవ్వుతూ తలాడించింది.

ఆపై ఏం మాట్లాడాలో తెలియలేదు ఆమెకు. ఇక ఉండబట్టలేక “అభిరామ్ ఇంట్లో ఉన్నారా అంకుల్?” అని అడిగేసింది ధైర్యం చేసి.

## సౌదామిని

“అదిగో సౌదామిని!” ఆనందాశ్చర్యాలు కలిసిన గొంతుకతో బిగ్గరగా అరిచాడు మాధవ అనే యువకుడు.

పెళ్లివారి గుంపులో అందరూ మాధవ చేయి చూపించిన వైపు ఆశగా చూశారు. పల్లకిని కిందకు దింపి పారిపోబోతున్న బోయీలు కూడా గుర్రం మీద వేగంగా తమ వైపే దూసుకువస్తున్న సౌదామినిని చూడగానే ఆగిపోయారు. పెళ్లివారి బృందాన్ని అడ్డగించిన దుండగుల ముఠా ఒక్కసారిగా ముఖముఖాలు చూసుకున్నారు.

పెళ్లివారి గుంపులో వృద్ధుడు ఒకడు “ఎవరా వస్తున్న వీరుడు?” అని అడిగాడు మాధవను.

“వీరుడు కాదు తాతా! వీరవనిత అని అడుగు. ఆమే సౌదామిని. స్వయంగా కాళికా అమ్మవారి అవతారం.” అన్నాడు మాధవ మెరుస్తున్న కళ్ళతో.

ఆ కాలంలో ఉజ్జయిని మరియు చుట్టుపక్కల ప్రాంతాలలో కొన్ని నమ్మకాలు ప్రాచుర్యంలో ఉండేది. అది స్వయంగా కాళికా అమ్మవారు కాళిదాసు మహాకవిని అనుగ్రహించి సంచరించిన ప్రాంతమని, అష్టాదశ శక్తి పీఠాలలో ఒకటిగా ఉజ్జయిని మహంకాళి వెలసిన ప్రదేశం కనుక ఆ చుట్టుపక్కల ప్రాంతమంతా అమ్మవారి సంరక్షణలో ఉంటుందని, అక్కడి ప్రజలకు ఏ విధమైన విపత్తు సంభవించినా అమ్మవారే ఏదో ఒక రూపంలో వచ్చి రక్షిస్తుందని అక్కడి ప్రజల నమ్మకం.

“మన రాజ్యంలో ఎక్కడ ప్రజలకు ఎలాంటి ఆపద సంభవించినా, మెరుపువేగంతో వెంటనే వచ్చి రక్షిస్తోంది ఆమె. ఆమె అసలు పేరు తెలియదు. ముఖం ఎవరూ చూడలేదు. అందుకే అందరూ కలిసి ఆమెను సౌదామిని అని పిలుస్తూ కాళికా అమ్మవారి రూపంగా కొలుస్తున్నారు తాతా!” అన్నాడు ఉత్సాహంగా పెళ్లి బృందంలోని మరొక యువకుడు.

ఆ ప్రాంతాన్ని దక్షణకోన అంటారు. అడవి ప్రాంతమే అయినా క్రూరమృగాలు సంచరించే ప్రాంతం కాదు. అక్కడ చుట్టూ చిన్న చిన్న గ్రామాలు ఉన్నాయి. అక్కడ ప్రజలు ఇంద్రేశ్వరానికి వెళ్లాలంటే ఈ దక్షిణకోన గుండా కాలిబాటను వెళ్లాల్సి ఉంటుంది. రాత్రిపూట అక్కడ ఎవరూ సంచరించరు. కానీ పగటి వేళల ప్రయాణీకులు, వ్యాపారస్తులు ఆ మార్గం ద్వారా ఎక్కువగా ప్రయాణిస్తూ ఉంటారు. ఆ రోజు విదియ. కాళికాలయంలో ముందే అనుకున్న ప్రకారం ఆ రోజు అక్కడ దారిదోపిడీ దొంగల రూపంలో పొంచి ఉన్న దుండగులకు, పక్క గ్రామానికి పల్లకీతో సహా వెళ్తున్న పెళ్లి బృందం కళ్ళపడ్డారు. వెంటనే వారిపై విరుచుకుపడ్డారు నిజమైన దొంగల్లాగా. అకస్మాత్తుగా జరిగిన ఈ సంఘటనకు పెళ్ళివారిలో కొందరు బెదిరి దొంగల చేతికి చిక్కగా, కొందరు పారిపోబోయారు.

ఇంతలో ఉన్నట్లుండి సౌదామిని రాకతో రేగిన కలకలం అర్ధమవ్వగానే దుండగుల ముఠా తాము దోచుకుంటున్న నగలను అక్కడే పడేసి, పెళ్లివారిని వదిలేసి వెంటనే కారుచిచ్చులా ముంచుకొస్తున్న సౌదామినిని ఎదుర్కోవడానికి సన్నద్ధమైంది. గతంలో ఎప్పుడూ ఇటువంటి దొంగల ముఠాలు ఆ ప్రాంతంవారిపై దాడి చేసిన దాఖలాలు లేవు. ఈ దుండగులు ఎక్కడనుండి వచ్చారో ప్రజలకు తెలియడం లేదు. అందరూ ముసుగులు ధరించి ఉన్నారు. గత నెల రోజులలో అక్కడ ఇటువంటి సంఘటన జరగడం అది రెండవసారి.

అది రెండు ఎత్తయిన బండల నడుమ సన్నగా వెళ్లే అడవి దారి. ఆ ప్రదేశంలో పెళ్లివారి గుంపును అడ్డగిస్తే, వారికి పారిపోవడానికి కుదరదని ఉపాయం పన్నారు దుండగులు. సన్నని దారి కావడం వల్ల ఏదైతే ఆ దుండగులకు దోచుకోవడానికి అనువుగా ఉంటుందని వారు అనుకున్నారో, అదే ఇప్పుడు వారికి అసౌకర్యంగా మారింది. సౌదామినిని చుట్టుముట్టడానికి వారికి అక్కడ జాగా సరిపోవటం లేదు. ఇద్దరిద్దరి చొప్పున మాత్రమే సౌదామినిని ఎదుర్కోగలుగుతున్నారు. కుడిచేత్తో పొడవాటి కత్తిని లఘువంగా తిప్పుతూ ఇంకో చేత్తో గుర్రాన్ని అదిలిస్తూ ఎంతో చాకచక్యమైన శిక్షణ పొందిన యుద్ధ వీరుని వలె ఆమె ఆ ముఠాపై విరుచుకుపడింది. అరఘడియ(12 నిమిషాలు) కాలంలోనే ఆమెతో యుద్ధానికి వారు సరిపడలేమని వారికి అర్థమైపోయింది. అప్పటికే ఆ ముఠాలో ఐదుగురు చనిపోయారు. మిగతావారు ఇంక చేసేది లేక వెనువెంటనే గాయాలతో పారిపోయారు.

పెళ్లివారి బృందం ఆనందంగా "సౌదామినికి జై" అంటూ జయజయధ్వానాలు పలికారు.

"నీకు శతకోటి ధన్యవాదాలమ్మా! నా బిడ్డ జీవితాన్ని కాపాడావు. నీ మేలు ఎన్నటికీ మరిచిపోలేము." అంటూ ఆమె కాలికి మొక్కబోయాడు పెళ్లికూతురు తండ్రి.

వెంటనే సౌదామిని అతనిని వారించి "మరేం భయం లేదు. వాళ్లు పారిపోయారు. మీరు ధైర్యంగా వెళ్ళండి." అంటూ గుర్రం మీద నుండి కిందకు దిగింది.

"సమయానికి దేవతలా వచ్చావు. వీళ్ళ గురించి మేము రక్షకభటులకు గతవారమే ఫిర్యాదు చేసినా లాభం లేకపోయింది. పక్క గ్రామానికి వెళ్లడానికి ఇదొక్కటే మార్గం కావడం వల్ల ఈ దారిని వెళ్ళక తప్పడంలేదు మాకు." అన్నాడు మరొక ఆసామి.

"భయపడకండి. మీ ఎవరికీ ఏం కాలేదుగా!" అంటూ అక్కడ చనిపోయి పడి ఉన్న ఇద్దరి దుండగుల ముసుగులు తొలగించి చూసింది సౌదామిని.

"వీరిలో ఎవరైనా మీకు తెలుసా? ఒకసారి పరిశీలించి చూడండి." గంభీరంగా అంది. మాధవ వెంటనే మిగతావారి ముసుగులు కూడా తొలగించాడు. అందరూ వారి ముఖాలు చూశారు.

"వీరెవరూ అసలు ఈ ప్రాంతానికి చెందినవారిలా కూడా లేరు. ఎప్పుడూ వీరెవరినీ ఈ ప్రాంతంలో చూసి ఎరుగమమ్మా! వీరి వస్త్రధారణ కూడా కొంచెం భిన్నంగానే ఉంది." తేల్చి చెప్పారు అందరూ కలిసి.

"ఇంతకూ నీవెవరమ్మా? ఇక్కడ మేము ఆపదలో ఉన్నామని నీకు ఎలా తెలిసింది?" ఆతృతగా ముందుకు వచ్చి అడిగాడు మాధవ.

"నా వివరాలు మీకు అనవసరం. మీకు ఏ సమస్య వచ్చినా నేను మీకు అండగా ఉంటాను. ధైర్యంగా వెళ్లండి. ఇటువంటి సమస్యలు వచ్చినప్పుడు కలిసికట్టుగా ఎదుర్కొండి." అని చెప్పి తిరిగి గుర్రాన్ని ఎక్కింది సౌదామిని.

"మరి ఈ కళేబరాలను ఏం చేయాలి?" మళ్లీ అడిగాడు మాధవ.

"శుభకార్యం కోసం వెళ్తున్నారు. వీటిని మీరు తీయవద్దు. ఇలాగే వదిలేయండి. పక్క ఊరు చేరగానే అక్కడి రక్షకభటులకు జరిగినది చెప్పండి. వాళ్లే వచ్చి ఈ దుండగుల విషయం చూసుకుంటారు." అని చెప్పి సౌదామిని గుర్రాన్ని వెనక్కి తిప్పింది.

"మరి కనీసం నీ పేరేమిటో చెప్పమ్మా! మమ్మల్ని రక్షించింది ఎవరో మాకు తెలియాలిగా!" అన్నాడు తాత వాత్సల్యంగా.

"అయితే ఇందాక మీరు నన్ను పిలిచిన ఆ పేరే ఖాయం చేసుకోండి." చిన్నగా నవ్వుతూ అంది సౌదామిని.

అందరూ మూకుమ్మడిగా "సౌదామినికి జై" అంటూ బిగ్గరగా పలికారు. ఆమె గుర్రాన్ని అదిలించింది. ఆ పేరుకు తగ్గట్టే మరుక్షణమే మెరుపు వేగంతో ముందుకు దూసుకుపోయింది. పెళ్లివారి బృందం గబగబా ఆ ప్రాంతంనుండి ముందుకు నడిచింది. ఎడమవైపునున్న ఎత్తైన

బండ వెనుకనుండి ఇదంతా గమనిస్తున్న కేతుకి నోట మాట రాలేదు. కేవలం అరఘడియ కాలంలో తన కళ్ళ ఎదుట జరిగిందంతా ఒక కలలా అనిపించింది. ఒక ఆడపిల్ల అంతటి యుద్ధ నైపుణ్యం ప్రదర్శించడం, తమ సైన్యాన్ని చిత్తు చేయడం ఎలా సాధ్యం అంటూ ఆలోచనలో పడ్డాడు. పెళ్లిబృందం కనుచూపు మేర దాటగానే నడుముకు కట్టి ఉన్న చిన్న బాకా వంటి పరికరాన్ని తీసి నెమ్మదిగా ఊదాడు.

"ఈసారి నిన్ను వెంబడించడానికి అవకాశం లేకుండా చేసావు సౌదామినీ! ప్రస్తుతం ఇక్కడ నేను చేయాల్సింది చాలా ఉంది. ఎక్కడికి పోతావులే! మరొక్కసారి నా చేతికి చిక్కకపోవు!" తనకు తానే చెప్పుకున్నాడు కేతు.

మరొక 4 హోరలు(గంటలు) గడిచాక మాధవ పక్క ఊరి రక్షకభటులను తీసుకొని ఆ ప్రాంతానికి వచ్చాడు. చూస్తే అక్కడ కళేబరాలు లేవు సరి కదా కనీసం వారిపై దాడి జరిగినట్లు తెలిపే ఆనవాళ్లు కూడా కనిపించలేదు.

*(కొనసాగింపు వచ్చే నెలలో)*

COMMENTS